క్లుప్తంగా

సర్టిఫికెట్ల పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

కంబాలచెరువు: ప్రభుత్వ అటానమస్ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్‌వర్క్ లెవల్ 4 ప్రకారం అకౌంట్స్ అసిస్టెంట్ సర్టిఫికేషన్ పరీక్షలో ఉత్తీర్ణులైన 56 మంది విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామర్స్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ డాక్టర్ రామచంద్ర, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పీవీవీ సత్య నారాయణ, బీఎఫ్ఎస్ఐ కో ఆర్డినేటర్ రమేష్ కృష్ణ విప్పర్తి, కె.సునీత, టి.శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

వృథా పోతున్న సురక్షిత నీరు



పైపులైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేట గ్రామపంచాయతీ పరిధిలోని రామకృష్ణనగర్ 13వ వీధి టర్నింగ్‌లో గోదావరి సురక్షిత తాగు నీరు వృథాగా పోతోంది. పైపులైన్‌కు చివర డమ్మీ వేయకపోవడంతో నీరంతా డ్రైనేజీలోకి వెళ్లడంతో పాటు రోడ్డుపై నిలిచిపోతోంది. దీని వల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి పైపులైన్‌కు డమ్మీ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడికి పీహెచ్‌డీ



కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జంతుశాస్త్రం అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ కాంద్రకుంట బాబు పీహెచ్‌డీ అందుకున్నారు. ఆయన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారు. ప్రొఫెసర్ విజయ నిర్మల మార్గదర్శకత్వంలో 'తూర్పుగోదావరి జిల్లాలోని వ్యవసాయ నేలల్లో పురుగు మందుల అవశేషాలు, భారీ లోహ కాలుష్య మూల్యాంకనం' అనే అంశంపై పరిశోధన నిర్వహించారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రకాశం నగర్: నారాయణపురం మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో గురువారం సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ కీర్తి చేకూరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎస్పీ నరసింహ కిశోర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతిని వెలిగించి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు ఒక్క జట్టుగా, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, అను శ్రీ సత్యనారాయణ ఒక జట్టుగా ఏర్పడి కాసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొత్తపల్లి బాలు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

పెదపూడి: ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని హిందుస్థాన్ యూనిలీవర్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాస్ మునగ అన్నారు. ఆ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం శహపురంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటపై ప్రభుత్వం అందించి రాయితీలు, ఇతర పంటల కంటే వచ్చే అధిక లాభాలను గురించి వివరించారు. రైతు వీరయ్య చౌదరి మాట్లాడుతూ తమ గ్రామంలో బోర్లు 15 అడుగుల లోతులో పడుతున్నాయి కానీ, ఉప్పు నీరు వస్తోందన్నారు. దీనిపై శ్రీనివాస్ సమాధానమిస్తూ కంపెనీవారు బోర్లకు ఆర్టికల్చర్ ద్వారా ఇచ్చే సబ్సిడీ, ఉపాధి హామీపథకంలో ఫామ్‌పాండ్స్ పథకాన్ని వివరించారు. కార్యక్రమంలో కంపెనీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నరేష్, ఫీల్డ్ ఆఫీసర్లు సతీష్, రాంబాబు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

రాజానగరం: దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల యోజన (డీడీయూ- జీకేవై) ద్వారా నిరుద్యోగ యువతకు సాఫ్ట్ సిల్క్ డెవలప్‌మెంట్‌పై మూడు నెలల శిక్షణ ఇస్తున్నామని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి నుంచి డిగ్రీ వరకూ చదువుకుని, 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయసున్న వారు అర్హులన్నారు. ఆసక్తి కలవారు 91541 44355, 80741 04876 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నాటకానికి ఊపిరి

- దేవీచౌక్ వేదికగా ప్రదర్శనలు
- దసరా ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణ
- ఇప్పటికీ తగ్గని ఆదరణ
- వన్స్‌మోర్ అంటున్న ప్రేక్షకులు



సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం

సీటీఆర్ఐ: పూర్వ కాలం నుంచి ప్రజలకు వినోదాన్ని అందిస్తున్న ప్రధాన సాధనం నాటకం. ఒకప్పుడు ఏడాదంతా వైభవంగా జరిగిన ప్రదర్శనలు నేడు దాదాపు కనుమరుగయ్యాయి. ముఖ్యంగా సినిమాలు వచ్చిన తర్వాత నాటకం వెనుకబడింది. అయితే కొన్ని వేదికలు ఇప్పటికీ ఆ రంగానికి ఊపిరి పోస్తున్నాయి. వాటిని తిలకించడానికి ప్రజలు కూడా విచ్చేస్తున్నారు. ముఖ్యంగా దేవీచౌక్‌లో జరిగే శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా నిత్యం ఓ నాటకం ప్రదర్శిస్తారు. అర్ధ రాత్రి దాటినా సరే పూర్తయ్యే వరకూ వీక్షించే ప్రేక్షకులు అక్కడ కనిపిస్తారు. ఇలా దాదాపు 92 ఏళ్లుగా దేవీచౌక్‌లో నాటకాలను ప్రదర్శిస్తున్నారు.

ప్రజలకు ఊరట

గతంలో నాటకాలు ప్రజలకు ఒక ఊరట. కళ్లముందు స్పెషల్ ఎఫెక్ట్స్‌తో, రాగయుక్తమైన పద్యాలతో కళాకారులు నటిస్తుంటే ప్రేక్షకులు ఎంతో ఆనందపడేవారు. నేడు వాటి స్థానాన్ని సినిమాలు ఆక్రమించాయి. అయినా దేవీచౌక్‌లో ప్రదర్శించే నాటకాలను ఇప్పుడు కూడా ప్రేక్షకులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఇక్కడ ప్రదర్శించే నాటకాలకు రాష్ట్ర వ్యాప్తంగా పేరు రావడంతో ఒక్కసారైనా ఇక్కడ నాటకాలలో నటించాలని ప్రతి కళాకారుడూ కోరుకునేవాడు. శ్రీరామాంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ తులాభారం, చింతామణి, బొబ్బిలి యుద్ధం, మహాకవి కాళిదాసు, సత్యహరిశ్చంద్ర, బాల నాగమ్మ, కురుక్షేత్రం వంటి నాటకాలలో ప్రసిద్ధి చెందిన రంగస్థలం నటులు నటించారు. సురభి ప్రదర్శించే నాటకాలలో ఫైర్ సెట్టింగ్‌కూ పెద్ద పేరు ఉండేది. వారి నాటకాలలో భారీ సెట్టింగ్‌లు ఉండటంతో సినిమా చూసిన అనుభూతి కలిగేది. షణ్ముఖ ఆంజనేయరాజు, పీసపాటి నరసింహమూర్తి, సూరవరపు వెంకటేశ్వర్లు, కాగితం సుబ్బారావు, లక్ష్మణరావు, సీఎస్ఆర్ అంజనేయులు, ద్వారంపూడి సూర్యారావు వంటి దిగ్గజాలు ఇక్కడ నాటకాలలో తమ ప్రతిభను ప్రదర్శించేవారు.



భక్త ప్రహ్లాద నాటకంలోని కళాకారులను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



నాటకాన్ని తిలకిస్తున్న ప్రేక్షకులు

తిలకించిన సినీ ప్రముఖులు

ఎస్వీ రంగారావు, అక్కినేని నాగేశ్వరరావు, గుమ్మడి వెంకటేశ్వరరావు, జమున, ప్రభాకర్ రెడ్డి, రేలంగి, అంజలీ దేవి, ఆదినారాయణరావు, సత్యనారాయణ, జి.వరలక్ష్మి, సావిత్రి, జెమినీ గణేష్, కృష్ణ, శారద, చలం, రాజబాబు వంటి తదితర తెలుగ తారలే కాకుండా సునీల్ దత్ వంటి హిందీ నటులు కూడా ఇక్కడ నాటకాలను తిలకించారు. సుబ్బిశెట్టి నాటకంలో సుబ్బిశెట్టిగా పద్మనాభం, బాల నాగమ్మలో మాయల ఫకీరుగా రాజనాల నటించిగా 1966, 68 సంవత్సరాలలో రాజసులోచన ఇక్కడ నాట్యం చేసింది.

> **క్రమం తప్పకుండా..**
>
> గత 92 ఏళ్లుగా క్రమం తప్పకుండా దేవీచౌక్‌లో నాటకాల ప్రదర్శన జరుగుతోంది. బయట నాటకాలకు ఆదరణ తగ్గినా దేవీచౌక్‌లో ప్రదర్శించే నాటకాలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. దసరా సందర్భంగా తొమ్మిది రోజులు ప్రదర్శించే నాటకాలకు జనం విశేషంగా తరలివస్తున్నారు.
>
> – బత్తుల రాజరాజేశ్వరరావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు
>
> **ఆదరణ తగ్గలేదు**
>
> దేవీచౌక్ అంటే దసరా ఉత్సవాలకు పెట్టింది పేరు. అలాగే ఇక్కడ ప్రదర్శించే నాటకాలు కూడా ఎంతో పేరుప్రఖ్యాతలు పొందాయి. సినిమాలు వచ్చాక నాటకాలు అంతరించిపోతున్న ఈ సమయంలో కూడా ఇక్కడ వేదికపై నటించడానికి కళాకారులు ఆసక్తి చూపుతున్నారు.
>
> – ఆశపు దుర్గా మల్లికార్జునరావు (మల్లిబాబు), ఉత్సవ కమిటీ, సహాయ కార్యదర్శి

శుభ్రత ప్రజల జీవన విధానం కావాలి

- కలెక్టర్ కీర్తి చేకూరి
- కోటిలింగాల ఘాట్‌లో క్లీనింగ్ డ్రైవ్



కోటిలింగాల ఘాట్‌ను శుభ్రం చేస్తున్న కలెక్టర్ కీర్తి తదితరులు

సీటీఆర్ఐ: స్వచ్ఛత, శుభ్రత ప్రజల జీవన విధానంలో భాగం కావాలని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కోటిలింగాల ఘాట్ వద్ద మెగా ఘాట్ క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని చీపురు పట్టి ఘాట్ పరిసరాలను శుభ్రం చేశారు. సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అవసరమన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్రటరీ జి.శైలజ వల్లి, మేనేజర్ ఎండీ అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

ధవళేశ్వరం: గ్రామంలో జరిగిన స్వచ్ఛతాహీ సేవ ర్యాలీలో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో డీపీఓ శాంతామణి, డీఎల్‌డీఓ వీణాదేవి, ఎంపీడీఓ ఆర్మ్‌స్ట్రాంగ్, పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

కడియం: గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్ పిలుపు నిచ్చారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో 'ఒక రోజు ఒక గంట అందరం కలసి (ఏక్ దిన్-ఏక్ గంట-ఏక్‌సాత్)'లో భాగంగా గురువారం ఆ గ్రామంలో రోడ్డు పక్కనే గల చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు సాకా కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● కడియంలో రోడ్ల పక్కన చెత్త తొలగింపు కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఎంపీడీవో పీవీ సుబ్బారావు ప్రారంభించారు. సర్పంచ్ మోసుగంటి సత్యవతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ రెడ్డి, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

● దుళ్ల నుంచి మురమండ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు, పిచ్చి మొక్కలను ఉమ్మడి పార్టీ నాయకులు, పంచాయతీ సిబ్బంది తొలగించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, తెదేపా అధ్యక్షుడు గురప్రు కొండయ్య మాస్టార్, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



జేగురుపాడులో రోడ్డును శుభ్రం చేస్తున్న సిబ్బంది

ప్రభుత్వ ఉద్యోగినులకు ఐరన్ మాత్రల పంపిణీ



ఐరన్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

రాజమహేంద్రవరం రూరల్: వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో పని చేస్తున్న 20–49 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఉద్యోగినులకు ఐరన్ మాత్రలు పంపిణీ చేస్తామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. వైద్య, ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయ ఉద్యోగినులకు గురువారం ఐరన్ మాత్రలు పంపిణీ చేసి, వాటిని మింగేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వారానికోసారి ఐరన్ మాత్రలు వాడటం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పి.కోమల, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి టి.శ్రీదేవి, రాజమహేంద్రవరం, కొవ్వూరు డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు పి.సరిత, సంధ్య, ప్రోగ్రాం అధికారులు శ్రీవల్లి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య సేవలు

రాజమహేంద్రవరం రూరల్: స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గురువారం తొర్రేడులో మహిళలకు వైద్య శిబిరం నిర్వహించారు. వారికి రక్తపోటు, మధుమేహం, టీబీ, కాన్సర్ పరీక్షలు చేశారు. కుటుంబ నియంత్రణ సూచనలు, ఆరోగ్య గుర్తింపు కార్డులు, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో కాతేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి నాగదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

కడియం: కడియపుసావరం, పొట్టిలంక ప్రాథమిక పాఠశాలల్లో డాక్టర్లు ఎం.మణిజ్యోత్స్న, ఎస్.జెస్సీ సుప్రియ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు జరిగాయి. కడియపుసావరంలో 152 మందికి, పొట్టిలంకలో 153 మందికి వైద్యసేవలు అందించారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకుంటున్న అయోధ్య రామ మందిరం నమూనా

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ రహదారిపై లక్ష్మీ హ్యుందాయ్ వెనుక గల ప్రజారాజ్యం గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన రాయల్ ట్రేడ్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను గురువారం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. మెయిన్ గేటు వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి సెట్, మైదానంలో తీర్చిదిద్దిన అయోధ్య రామ మందిరం నమూనా ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకులు ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, గురుగోపీనాథ్ మాట్లాడుతూ గత ఏడాది జలకన్యలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని, ఈ ఏడాది అయోధ్య రామ మందిరం నమూనాను తీసుకువచ్చామన్నారు. సందర్శకులు కుటుంబ సమేతంగా సంతోషంగా గడపడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యాళ్ల ప్రదీప్, విశ్వనాథరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దసరా పూజలు



మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో పార్వతీమాత



వాసవీమాతకు సిరి ధాన్యాలతో అలంకరణ



మోరంపూడి సాయినగర్‌లో అమ్మవారు

సీటీఆర్ఐ: దసరా శరన్నవరాత్ర మహోత్సవాలలో నాలుగో రోజు గురువారం దేవీచౌక్‌లో అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. అమ్మవారి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే భక్తులు కుంకుమ పూజలో పాల్గొన్నారు. మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో పార్వతీమాత కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు.

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి సాయి నగర్ విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కాత్యాయనిదేవిగా అలంకరించినట్టు ఆలయ ధర్మకర్త మేడిత్రిమూర్తులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారు కాత్యాయనిగా దర్శనమించ్చారు. కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో విజయ దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు.

దత్త పీఠంలో ప్రత్యేక అభిషేకాలు

అనపర్తి: గ్రామంలోని ఔదంబర దత్తపీఠంలో కొలువైన దత్తాత్రేయుడికి గురువారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. గురుస్వామి మల్లిడి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అర్చకుడు నరసింహమూర్తి అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైద్యరంగంలో ఫార్మసిస్టులకు ప్రాధాన్యం

రాజానగరం: వైద్యరంగంలో ఫార్మసిస్టులకు ప్రాధాన్యం పెరిగిందని, ఇది ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యరంగానికి వెన్నెముకగా నిలుస్తుందని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శిబిరంలో 141 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ డాక్టర్ ఎండీ ధనరాజ్, ఎస్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా, డాక్టర్ ఎస్.గాయత్రి, డాక్టర్ ఏఆర్ మగేష్, డాక్టర్ వీడీ సుందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● దివాన్ చెరువులోని విజేస్ ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవంతో పాటు ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైర్ పర్సన్ ఎస్.శకుంతల, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌వీవీ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర, డీన్ డాక్టర్ కె.శ్రీనివాస్, డాక్టర్ ఎం.లక్ష్మీ ప్రసన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన విజ్ఞాన పరిరక్షణ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ తదితరులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన సెమినార్‌లో వచ్చిన పరిశోధన పత్రాలతో రూపొందించిన పుస్తకాన్ని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ గురువారం ఆవిష్కరించారు. 'గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ, భవిష్యత్తు తరాలకు చేర్చడం' అనే అంశంపై ఆగస్టు 21, 22లో జరిగిన సెమినార్‌లో 46 పరిశోధన పత్రాలతో పాటు కొన్ని ఆర్టికల్స్ వచ్చాయన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి మాట్లాడుతూ ఈ పుస్తకానికి అధ్యాపకులు డాక్టర్ కె.సుబ్బారావు, డాక్టర్ ఆర్ఎస్ వరహాలదొర, డాక్టర్ ఆర్ఎస్ సాంబశివరావు, డాక్టర్ ఎస్‌పీఎస్ సూర్యనారాయణ ఎడిటర్లుగా వ్యవహరించారన్నారు.

ఘనంగా పండిట్ దీన్ దయాళ్ జయంతి



పిడింగొయ్యిలో దీన్ దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: బీజేపీ మండల ఇన్‌చార్జి పోతురాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పిడింగొయ్యి, హుకుంపేట, శాటిలైట్ సిటీ గ్రామాల్లో గురువారం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తనుబుద్ధి సూర్య భాస్కరరావు మాట్లాడుతూ తన జీవితాన్ని దేశసేవకు అంకితం చేసిన మహనీయుడు దీన్ దయాళ్ అన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు మజ్జి సాయి, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు పబ్బిరి సతీష్, గుడ్ల అనంత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడిగా మధు

ప్రకాశం నగర్: సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడిగా తాటిపాక మధు ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని గురువారం ఆయన ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 వరకు చండీగఢ్‌లో జాతీయ మహాసభలు జరిగాయన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రతిపాదించిన జాతీయ కమిటీలో తనను ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేసినట్టు తెలిపారు.



అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు

నగరాభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్ రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

సీటీఆర్ఐ: నగర సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా నగరపాలక సంస్థ 2026–27 వార్షిక బడ్జెట్‌ను సిద్ధం చేయాలని అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రతిపాదిత బడ్జెట్ రూపకల్పనపై శాఖాధిపతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2026–27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ కేటాయింపుల్లో భాగంగా అన్ని విభాగాల అధికారులు తమ సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ప్రజల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా వార్షిక బడ్జెట్ అంచనాలు ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్యం, ఆహ్లాదకరమైన వాతావరణం అందించేలా పార్కుల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు అధిక కేటాయింపులు ఉండాలన్నారు. అలాగే నగరపాలక సంస్థ ఆదాయాన్ని ఆర్జించే విధంగా బడ్జెట్ అంచనాల నివేదికను అక్టోబర్ 8 నాటికి అందజేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలుకు స్వర నివాళి



ఎస్పీ బాలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిత్ మోహన్ మిత్ర తదితరులు



వేమగిరి సెంటర్‌లో బాల సుబ్రహ్మణ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): గాన గంధర్వుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతిని పురస్కరించుకుని జిత్ మోహన్ మిత్ర కళావేదికలో గురువారం స్వర నివాళి కార్యక్రమం నిర్వహించారు. నట గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ బాలు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిత్ మోహన్ మిత్ర మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగిన గాయకులలో బాల సుబ్రహ్మణ్యం ఒకరన్నారు. ఆత్మీయ అతిథులుగా డాక్టర్ వంక బాలకృష్ణ, ఆదిత్య, డాక్టర్ ఎన్‌సీ రమేష్, డాక్టర్ హేమ నళిని, కృష్ణ, ఎ.కృష్ణదత్తాత్రేయ శర్మ, రమణమూర్తి, మురళీ కృష్ణ హాజరయ్యారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: తెలుగు వారి వాణిని ప్రపంచానికి చాటిన మహోన్నతుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం అని రాకా కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ధవళేశ్వరం ఇరిగేషన్ కార్యాలయం సమీపంలోని ఎస్పీ బాలు విగ్రహం వద్ద గురువారం రాకా కల్చరల్ అసోసియేషన్, గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ కార్యాధ్యక్షుడు యరమోతు ధర్మరాజు, ఇంజినీర్ జి శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మదర్షా అలీ, భమిడిపాటి రామకృష్ణ మూర్తి, సూరపరెడ్డి తాతారావు, దేశిరెడ్డి బలరామ నాయుడు, బొబ్బిలి శ్రీనివాసరావు, కేఎస్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

కడియం: సంగీత ప్రపంచానికి గాయకుడు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం చేసిన సేవలు మరువలేనివని అభిమాని పి.నల్లరాజు కొనియాడారు. ఆయన ఆధ్వర్యంతో గురువారం వేమగిరి సెంటర్‌లో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సైనికుడు బొర్రా సుబ్బారావు, సాయి రామ్ ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో బాలు విగ్రహం వద్ద రాకా, గోదావరి కల్చరల్ అసోసియేషన్ సభ్యులు